సంక్షేమ సారథి సీఎం జగన్



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



చట్లవాడలో గ్రామస్తులకు ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



మొండిగెడ్డ పంచాయతీలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో నిలిచారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మొండిగెడ్డ పంచాయతీలో ఆమె మంగళవారం పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా 270 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

హామీలన్నీ అమలు:
పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపుతున్నారన్నారు. కుట్ర రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ ప్రియాంక, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీటీసీ నాగమణి, నాయకులు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం:
అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: ముఖ్యమంత్రి దిశా నిర్దేశంతో శివారు గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని జీనబాబు పంచాయతీ దాయర్తి, మకానపల్లి, సరియా, దిబ్బపాలెం, జీనబాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 334 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి, సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు గుణపాఠం చెబుతారన్నారు. జీనబాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పాల్గుణ తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లపై అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈవో వెంకటరావు, హెచ్‌ఎం విమలకుమారి, సీఆర్పీ రవికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన: రంపచోడవరం
ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

మారేడుమిల్లి : దేశంలో మరెక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన సాగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని జీఎం వలస పంచాయతీ పరిధిలోని గొందివాడ, చట్లవాడ పంచాయతీ పరిధిలోని చట్లవాడ, పోట్లవాడ, నూకలేటి వాడ, వేజువాడ, ఉక్కలూరు, బోదులూరు గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధనలక్ష్మి పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 350 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గడప గడపకు కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు.

ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, కో–ఆప్షన్ సభ్యుడు జి.ధర్మరాజు, సర్పంచ్‌లు ప్రేమలత, కె.జాకబ్, కె.లక్ష్మి, వైస్ సర్పంచ్ వీరబాబు, మండల పార్టీ కన్వీనర్ ఎస్.సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, మండల యూత్ అధ్యక్షుడు అనిల్ ప్రసాద్ (బాబీ), నాయకులు చంటి, లింగారెడ్డి, స్మిత్, విక్టర్ బన్ను, సూర్యగౌడ్, నారాయణరావు, అనిదీప్ కుమార్, శ్రీనివాసు రెడ్డి, సుందర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

దేవీపట్నం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం పర్యటించనున్నట్టు పార్టీ వర్గీయులు తెలిపారు. ఇందుకూరుపేటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతాల్లోని 100 మందికి ఇళ్ల పట్టాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని గ్రామ సచివాలయం భవనం ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం శరభవరం పంచాయతీలోని కంబలంపాలెం, ఉప్పయ్యపాలెం శరభవరం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలో శిథిలదశలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటుచేస్తున్నట్టు ఏఈఈ వెంకటరమణ చెప్పారు. ఈ కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో సుమారు 20 స్తంభాలు పాడయ్యాయని, ముందస్తు జాగ్రత్తగా కొత్త వాటిని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంగవరం : గ్రీవెన్స్‌లో గిరిజన ప్రజల నుంచి వచ్చిన అర్జీలు సత్వర పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది తగిన కృషి చేయాలని తహసీల్దార్ శ్రీమన్నారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీమన్నారాయణ మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ పరమైన పలు సమస్యలను ఆయన పరిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసులు గ్రీవెన్స్ నిర్వహించారు. ఆర్ఐ జిలానీ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి ఆర్థిక సాయం



ఎంపీటీసీ సభ్యుడు గాంధీకి నగదు అందజేస్తున్న శివప్రసాద్

కొయ్యూరు: ఇటీవల అనారోగ్యానికి గురైన శరభన్నపాలెం ఎంపీటీసీ లోకుల సోమాగాంధీకి నేను సైతం చారిటబుల్ సంస్థ అండగా నిలిచింది. ఎంపీ మాధవి ఆదేశాల మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాంధీని సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ మంగళవారం పరామర్శించి, రూ.15వేల అందజేశారు. ఆపదలో ఉన్నవారికి సాయం చేయడంలో సంపూర్ణ ఆనందం ఉంటుందని శివప్రసాద్ చెప్పారు. చికిత్స పూర్తయిన తరువాత అతనికి శరభన్నపాలెం తీసుకువచ్చేందుకు ఆస్పత్రి నుంచి వాహనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

కూడారై ఉత్సవం నేడు

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం 'కూడారై' ఉత్సవాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజున కూడారై పాశురం పఠించి, ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గోదాదేవిని వివాహం చేసుకోవడానికి రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజుగా కూడారై ఉత్సవాన్ని జరపనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామార్చన నిర్వహిస్తారు. బెల్లం, పంచదారలతో వేర్వేరుగా రెండు పెద్ద పాత్రల్లో పాయసం తయారు చేసి, సంప్రదాయ పూజలు చేసి ప్రజలకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. కూడారై ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు.

అనిత సేవలు మరువలేనివి



అనిత సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అరకులోయరూరల్: సుంకరమెట్ట పంచాయతీ పెద గంగుడిలో కిల్లో అనిత ప్రథమ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సమాధి వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అనిత చేసిన సేవలను పలువురు కొనియాడారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, నాయకులు కొండలరావు, రాధ, గణేష్, పాస్టర్ల రాజ్‌కుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న సీఐ జీడిబాబు, పోస్టల్ శాఖాధికారి ఉపేంద్ర

అరకులోయ రూరల్: పోస్టల్ సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అరకులోయ సీఐ జి.దేముడుబాబు అన్నారు. స్థానిక పోస్టల్ శాఖ కార్యాలయం ఆవరణలో మంగళవారం అరకు డివిజన్ అధికారి ఉపేంద్ర ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అరకులోయ సీఐ జి.దేముడుబాబు మాట్లాడుతూ నిస్వార్థంగా ఉత్తమ సేవలందిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. పోస్టల్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



మండల పార్టీ అధ్యక్షుడు గాసిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రా గాసి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, పార్టీ శ్రేణులు కలిసి సుంకరమెట్ట పంచాయతీ బెడగుడ గ్రామంలో మంగళవారం సందర్శించి, గాసిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యానికి అరకు ఎమ్మెల్యే పాల్గుణ కృషి చేస్తారని, పార్టీ అండగా ఉంటుందన్నారు. నాయకులు కొండలరావు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, తదితరులున్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ చిన్నారావు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. స్థానిక పశుసంవర్థక శాఖ కార్యాలయం వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో టీడీపీకి చెందిన పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యుల ఏకపక్ష నిర్ణయాలతో తప్పుడు తీర్మానంతో గ్రామ పంచాయతీ పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని, దీనిపై నిలదీస్తే కక్షపూరితంగా, రాజకీయ కుట్రల్లో భాగంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ చిన్నారావు అన్నారు. వారు మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పూర్తిగా నిలుపుదల చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సూర్యప్రకాష్, పరుశురం, సుందర్‌రావు, కొండలరావు పాల్గొన్నారు.

గజవాహనంపై తిరువీధి సేవ



గజవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం



పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి ఆరాధనలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం గజవాహనంపై స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. చిన్నపల్లకిలో గోదాదేవి అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాఢవీధుల్లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు స్వామివారి మూలవిరాట్‌కు కింద దిగువన ఉన్న ఆలయాల్లో నిత్యార్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు జరిగాయి. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 26వ పాశురాన్ని విన్నపం చేశారు. పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి ఆరాధనలు జరిపారు. గజవాహనంలో స్వామివారిని, పల్లకిలో అమ్మవారిని ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి మండల దుర్గాప్రసాద్ కోరారు. భీమవరంలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దుంపలు, జీడిమామిడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



ఊరేగింపులో భక్తులు

ఎటపాక: భద్రాద్రి సీతారామచంద్రస్వామి అధ్యయనోత్సవాల్లో భాగంగా మండలంలోని పురుషోత్తపట్టణంలో స్వామి వారికి రాపత్తు సేవ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో భద్రాచలం రామయ్యకు రాపత్తు సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా భద్రాద్రి రామాలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యులు గొంగడి వెంకటరామిరెడ్డి, రేవతి, రామిరెడ్డి, ఆకుల శ్రీనివాసరావు, వీరారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులున్నారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

సామాజిక భవనం ఏర్పాటుకు స్థలం కోసం వినతి



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఎస్పీ నాయకులు

వీఆర్ పురం: రేఖపల్లిలో ఆదివాసీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) మండల అధ్యక్షుడు పాయం లక్ష్మణరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. రాజు, శ్రీనివాస్‌రావు, మల్లయ్య , వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మేలుకొలుపు



చూచుకొండలో మేలుకొలుపులో భక్తులు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపుల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ధనుర్మాసంలో భాగంగా గత నెల 16న ప్రారంభమైన మేలుకొలుపుల కార్యక్రమం నిర్విరామంగా సాగుతుంది. భోగి రోజున మేలుకొలుపుల కార్యక్రమం ముగుస్తుంది. చూచుకొండలో వందలాది మంది భక్తులు తెల్లవారు నిద్రలేచి చన్నీటి స్నానమాచరించి భజనలు చేసుకుంటూ పాటలు పాడుతూ గ్రామంలో దేవాలయాలకు వెళ్లి దేముళ్లను నిద్రలేపుతూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకున్న విద్యార్థులతో సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్‌కుమార్

జి.మాడుగుల: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే, ఓసీ ఆర్.సుదీప్ వాక్‌చౌరే ఆదేశాల మేరకు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా నుర్మతి ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ సీఆర్‌పీఎఫ్–198 బెటాలియన్ పోలీసు ఆధ్వర్యంలో విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్–198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.ఉదయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సంక్రాంతి పండగను వైభవంగా జరుపుకోవాలన్నారు. విద్యార్థినులకు భోజనం ఏర్పాటు చేశారు. ప్రతి తరగతిలో చదువులో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్న విద్యార్థిలను నగదు బహుమతి అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో మడతకొండ, పూతికమెట్ట రోడ్ల కోసం నిధుల మంజూరుకు కృషి చేశామని, పనులు పూర్తికావడానికి ప్రజలు సహకరించాలన్నారు. పోలీస్ సిబ్బంది సత్యారావు, సర్పంచ్ సూరిబాబు, బొయితిలి పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కరరావు

పెదబయలు: సీకరి పంచాయతీ అరిమెర గ్రామంలో భూ రీసర్వేపై తహసీల్దార్ భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వేతో రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయన్నారు. తొరంగుల, చిన్నగుల్లేలు, సీమకొండ, కూతంగి పుట్టు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, గ్రామసభలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ మేరకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు–487, నోటీసులు–265 అందజేసినట్టు తెలిపారు. అరిమెర గ్రామంలో ఆరు అభ్యంతరాలు స్వీకరించామన్నారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని 23 పంచాయతీల్లో భూ రీసర్వే చేపట్టామన్నారు. సర్పంచ్ కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు వంతాల ఆనందరావు, నాయకులు కనకరాజు, వీఆర్వో లక్ష్మీ, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య శిబిరానికి వచ్చిన గిరిజనులు



ఇంజరిలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: కోల్లాపుట్టు పంచాయతీ బూసిపుట్టు గ్రామంలో నేచర్ సంస్థ సహకారంతో సర్పంచ్ రామూర్తి ఆధ్వర్యంలో కిల్లోగుడ వైద్యాధికారి కరుణ పర్యవేక్షణలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 162 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కరుణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వైద్య సిబ్బంది నేచర్ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ బాలరాజు, గౌరీపటాన్నయక్, సింహాచలం, సంతోష్ పాల్గొన్నారు.

పెదబయలు: ఇంజరి పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు 104 వైద్యాధికారి డాక్టర్ అహ్మద్ బషీర్ చెప్పారు. గర్భిణులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించి, ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్ఎం. ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది ఉన్నారు.

సీపీఎం నేతల నిరసన

అడ్డతీగల/కూనవరం/రాజవొమ్మంగి/వై.రామవరం/ఎటపాక/దుంబ్రిగుడ: సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులతో అడ్డతీగల, కూనవరం, రాజవొమ్మంగి, వై.రామవరం, ఎటపాక, దుంబ్రిగుడ మండలాల్లో మంగళవారం నిరసన తెలిపారు. జీవో నెంబర్ ఒకటి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, నాగేశ్వరరావు, గుర్మీసింగ్, రామారావు, శ్రీను, పండమ్మ, సత్యం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

60 లీటర్ల నాటు సారాతో ఇద్దరి అరెస్ట్

పాడేరు రూరల్: పాడేరు–చోడవరం ప్రధాన రహదారి ఘాట్‌లోని డైమాండ్ పార్క్ వద్ద 60 లీటర్ల నాటు సారాతో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్టు పాడేరు ఎస్ఐ రంజిత్‌కుమార్ మంగళవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. మోదాపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆటోలో నాటుసారా తరలిస్తున్నట్టు తమకు సమాచారం రావడంతో డైమాండ్ పార్కు వద్ద కాపు కాసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేసి వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నృత్య ప్రదర్శనలో యలమంచిలి విద్యార్థుల ప్రతిభ

యలమంచిలి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాజమండ్రి ఆనం కళాక్షేత్రంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన నృత్య ప్రదర్శనలో యలమంచిలి పట్టణానికి చెందిన పి.గీతాశ్రీ, డి.వాహిని ప్రియ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రంలో నృత్య కళాకారులు అందరూ పాల్గొన్న ఈ పోటీల్లో యలమంచిలి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన గీతాశ్రీ, వాహిని ప్రియకు రూడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు.